

*Author Of Highest Number Of Novels In Telugu*

# సూర్యదేవర రామ్ మోహన రావు



# మానవ యజ్ఞం

# మానవ యజ్ఞం

సూర్యదేవర రామ్‌మోహనరావు

మధుప్రియ పబ్లికేషన్స్

# మానవ యజ్ఞం

**1979**వ సంవత్సరం....

మే నెల... ఎండ నిప్పులు చెరుగుతోంది. ఆ ఎడారి ప్రాంతం అంతా అగ్నిగోళంలా భగభగ మండుతోంది. చుట్టూ ఇసుక దిబ్బలు తప్ప చిన్న మొక్క కూడా లేని ఆ ప్రాంతంలోకి సామాన్యులెవరూ అడుగుపెట్టరు. వ్యాపారులు కూడా ఆ ఎడారిలో ఈ నెలల్లో ప్రయాణం చెయ్యరు.

నరసంచారం లేని ఆ ఎడారిలోకి అడుగు పెట్టాడో యువకుడు.

ఇసుక రివ్వునలేచి మొహాన్ని కొట్టింది. కళ్ళు మంటలు పుట్టాయి. అరచేత్తో నలుపుకున్నాడు. కళ్ళు భగ్గున మండాయి. తన తప్పేంటో తెలిసి, వెంటనే జేబులో వున్న కర్చీఫ్‌ని తీసుకొని భుజానికి తగిలించుకున్న బ్యాగ్‌లోంచి వాటర్ బాటిల్ తీసి చుక్క నీరు కింద వదలకుండా కర్చీఫ్‌ని కొద్దిగా తడిపి కళ్ళు తుడుచుకున్నాడు. కాస్త శాంతించినట్లయింది. కూలింగ్ గ్లాసెస్ కళ్ళకి తగిలించుకుని తిరిగి నడవసాగాడు.

*　　*　　*　　*　　*

భారతదేశ రక్షణశాఖ కార్యాలయం... న్యూఢిల్లీ.

ఆ రోజు ప్రధానమంత్రితో త్రివిధ దళాధిపతుల సమావేశం రహస్యంగా జరుగుతోంది.

అయిదు నిమిషాల తేడాతో పటిష్టమయిన భద్రతా ఏర్పాట్లమధ్య రావల్సిన ముఖ్యులంతా వచ్చారు.

అందరిలోనూ ఏదో ఉద్విగ్నత. చెప్పలేని భావ సంచలనం. కానీ తమ భావాలని వ్యక్తపరచగూడదన్న కఠినమైన నిబంధనలకి లోబడిన వాళ్ళు కనుక, ఎవరికి వారే గంభీరంగా వున్నారు.

ఆర్మీ చీఫ్ లాంచనంగా రిపోర్ట్ చదివాడు. అంతా ఆమోదసూచకంగా సంతకాలు చేశారు.

ప్రపంచవ్యాప్తంగా తాము ఎదుర్కోవలసిన వాళ్ళని గురించి చర్చించుకున్నారు. దానికి తగిన ప్రణాళికని సిద్ధంచేసుకున్నారు. అంతా పకడ్బందీగా ఏ పొరపాటూ జరక్కుండా వుండేలా తాము తీసుకున్నటువంటి చర్యల గురించి అణుశాస్త్రవేత్త వివరించాడు.

ప్రధానమంత్రి సంతృప్తి చెందినట్లుగా చిరునవ్వుతో చూశారు. ముందే నిర్ణయించబడిన అంశం కావడంతో ఆ సమావేశం అరగంటలోనే ముగిసింది.

సమావేశం ముగించగానే వెళుతున్న వారి కాళ్ళబూట్ల శబ్దం ఆ కారిడార్లో లయబద్ధంగా విన్పించింది. తామేమీ తప్పు చేయమన్న ఆత్మ విశ్వాసాన్ని నింపుకున్న నడకలవి... కానీ వారికి తెలీదు తాము చేస్తున్న ప్రయోగం భవిష్యత్తులో ఎంతటి ముప్పుని కొనిరాబోతోందో...

* * * * *

క్షిపణి ప్రయోగ కేంద్రం బాలాసూర్....

శాస్త్రవేత్తలంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్న క్షణం రానేవచ్చింది. తమ జీవితకాలంలో తాము సాధించలేమేమోననుకున్న అణ్వస్త్ర ప్రయోగం.... ఆ రోజే జరుగుతోంది. ఈ సువిశాల భారతదేశాన్ని మరింత పటిష్టపరిచి ప్రపంచదేశాల మధ్య సగర్వంగా తలెత్తుకునే విధంగా చేసే అణ్వస్త్ర ప్రయోగం... ఈరోజే.

ఇక భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం కాదు. ఇక ఇప్పుడు నిన్నగాక మొన్న కనిపెట్టబడిన దేశాలు పసుపుమీదా, వేపచెట్టుమీదా పేటెంట్లు పొందుతుంటే నిస్సహాయంగా వూరుకోవాల్సిన దేశం కాదు.

భారతదేశం అంటే అనాగరికులనీ, అడవి మనుష్యులని హేళన చేస్తుంటే సహించాల్సిన దుస్థితిలో లేని దేశమిది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద మార్కెట్ వ్యవస్థ వున్న దేశం. ఇదొక్కటే చాలు ప్రపంచంలోని వివిధదేశాల వ్యవస్థలని మన గుప్పిట్లో పెట్టుకోడానికి.

ఇక మన దేశంవైపు ఎవరూ కన్నెత్తి చూడకుండా తగిన జాగ్రత్తలో మనముంటే భారతీయులకు ఈ ప్రపంచంలో ఎదురనేదేలేదు.

ఎన్నో దశాబ్దాలుగా శాస్త్రవేత్తలు చేస్తున్న కృషికి ఫలితం... కాసేపట్లో కనిపించబోతోంది. అక్కడున్న అందరి హృదయాలూ ఆతృతకు లోనయి వున్నాయి.

"సర్ ఎవ్రిథింగ్ ఈజ్ ఓ.కె..." కంప్యూటర్ స్క్రీన్‌ని పరిశీలిస్తూ చెప్పాడు ఒకతను.

చీఫ్ మార్షల్ కళ్ళతో సైగచేశాడు. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. టెన్...నైన్...ఎయిట్...

* * * * *

ఎడారిలో కాస్తున్న ఆ ఎండకి చర్మం బర్న్ అయిపోకుండా అన్పిస్తుందా యువకునికి. మాటిమాటికి నాలుక పిడచకట్టుకుపోతున్నట్లు అనిపిస్తోంది. కాళ్ళు ఇసుకలో కూరుకుపోతుంటే, కాలుతీసి కాలువేయడానికి ఆ కాలికీ, ఈ కాలికి పది కేజీలు బరువు కట్టినట్లుగా వుంది. వేడిమిని తట్టుకునే షూ వేసుకోవడం పనికివచ్చింది. లేకపోతే ఈ పాటికి కాళ్ళచర్మం లేచి వచ్చేది.

ఓసారి చుట్టూ కలియచూశాడు. తాను అనుకున్న ప్రదేశానికి వచ్చినట్లనిపించింది. తను నడిచిన అడుగులు సమయం చూసుకున్నాడు. అది సరయిన ప్రదేశమే అనిపించింది. అక్కడ ఆగాడు. బ్యాగ్‌లోంచి మళ్ళీ వాటర్ బాటిల్ తీసి కాస్తనీరు తాగాడు. అది లోపలపెట్టి మరో వస్తువును తీసి అప్యాయంగా తడిమాడు.

* * * * *

అందరి హృదయాలూ వేగంగా కొట్టుకుంటున్నాయి. కంప్యూటర్ స్క్రీన్‌మీద అంతా క్లియర్‌గా వుందన్న మెసేజ్ స్క్రోల్ అవుతోంది. ఊపిరి భారంగా పీల్చి వదులుతున్నారంతా... సెవెన్.... సిక్స్... ఫైవ్... ఫోర్....

* * * * *

గాలికి రెపరెపలాడుతున్న ఆ నీలిరంగు దుప్పట్టాని ఆప్యాయంగా మొహానికి హత్తుకున్నాడతను. ఆమె మేని సుగంధ పరిమళం చుట్టు ముట్టింది. మండువేసవి గాల్పు కూడా పండువెన్నెల్లా చల్లగా తోచింది. మనసుకి మంచి గంధపు పూత పూసినట్లయింది.

దుప్పట్టా చివరన వేసిన ముడిని తడిమాడు. చిరుసవ్వడి... తన చెవి దగ్గర ఆమె పెదవుల గుసగుసని గుర్తుచేసింది. నిండయిన ఆమె హృదయ

సంపదని కాపాడిన ఆ దుప్పట్టా నేడు తమ ప్రేమచిహ్నంగా ఈ ఎడారిలో సగర్వంగా రెపరెపలాడబోతోంది. వస్త్రం అశాశ్వతం కావచ్చు. కానీ ఈ జ్ఞాపకం తనున్న వరకూ శాశ్వతం.

అతను ఇసుకను తవ్వి తను తెచ్చిన ఇనుపరాడ్‌ని లోతుగా పాతి దానికి దుప్పట్టాని కట్టాడు. అది గాలికి ఎగురుతూ దాని కొసనున్న ముడిలోంచి ఘల్లుఘల్లుమనే శబ్దాన్ని వెలువరించ సాగింది.

అతను విజయగర్వంతో దానివంక తృప్తిగా చూశాడు. ఆమె గుర్తొచ్చింది. తమ ఆశలు గుర్తొచ్చాయి. ఇక తమ ప్రేమకి ఎదురులేదు... వెనుదిరిగాడతను.

*　*　*　*　*

త్రీ.... టూ... వన్... జీరో.... అంతటా నిశ్శబ్దం. అణ్వాయుధాన్ని మోస్తున్న క్షిపణి రివ్వున గాల్లోకి లేచింది. ఇంకెంతో సేపు లేదు... అయిదే అయిదు నిమిషాలు... తమ ప్రయోగం ఫలించిందో లేదో తెలియడానికి.

కేవలం తమకే కాదు.... అన్ని దేశాలమీదా డేగకళ్ళతో అనుక్షణం పహరాకాస్తున్న అమెరికా లాంటి దేశాలు కూడా ఇట్టే పసిగట్టేస్తాయీ ప్రయోగాన్ని. రేపు పేపర్లనిండా పతాకశీర్షికల కెక్కుతుంది ఈ విషయం. దీనిని ప్రభుత్వం వెల్లడించేవరకూ భారతదేశంలో ఎవరికీ తెలీనంత పకడ్బందీగా నిర్విహించారీ ప్రయోగాన్ని.

అయిదు నిమిషాలూ అయిదు యుగాలుగా నడుస్తున్నాయి వాళ్ళకి. ఎవరూ ఎవరితో చర్చించుకోవడంగానీ, మాట్లాడుకోవడటంగానీ కనీసం కంటిచూపులు కూడా లేవు. అందరూ కంప్యూటర్ స్క్రీన్‌వైపే చూస్తున్నారు ఊపిరి బిగబట్టి. అక్కడనుంచి వచ్చే సిగ్నల్స్ ఈ దేశ భవిష్యత్‌ని నిర్ధారిస్తుందని తెలుసందరికి.

ఇది దేశప్రతిష్టకి సంబంధించిన వ్యవహారం కాదు. దేశరక్షణకి సంబంధించిన వ్యవహారం. ఇందులో విజయమే తప్ప అపజయానికి తావుండకూడదు.

*　*　*　*　*

ఆమె తొలి ముద్దు.....
తన హృదయానికి తొలి పొద్దు....
ఆమె చిరునవ్వు.....
తన జీవిత నందనవనంలో అరవిరిసిన రోజాపువ్వు...
ఆమె వేసే ప్రతి అడుగు...

మండే తన మనసులో కురిసిన తొలకరి చినుకు....

ఆమె ప్రతీ జ్ఞాపకం... ఆమె తన మెడలో వేసిన వాడని కుసుమ పరిమళభరితం....

ఆలోచనల్లో నడుస్తున్న అతనికి అకస్మాత్తుగా భూనభోంతరాలు బద్దలవుతున్నంత శబ్దం చెవిని చేరింది. అయోమయంగా చూశాడు. సెకన్లో వెయ్యోవంతులో అతని శరీరం వేడెక్కుతున్నట్లుగా గ్రహించుకోగల్గాడు. ఆ గ్రహింపుకి వచ్చిన మరుక్షణంలో మరేమీ మిగలలేదక్కడ. గాలికూడా స్తంభించిపోయింది.

ఆ ఇనుపరాడ్ కరిగినంత కరగగా, మిగతాది వంకర తిరిగిపోయింది. దుప్పట్టా కాలిపోగా దాని చివర కట్టిన వస్తువులు నల్లగా, మసిబొగ్గుల్లా మాడిపోయిన అతని మృతదేహం వంక జాలిగా చూస్తున్నాయి.

*　　*　　*　　*　　*

1998వ సంవత్సరం. పంజాజ్‌లోని ఓ కుగ్రామం. నాగరికతకి కాస్త దూరంగా ఉన్న సంప్రదాయక వాతావరణం. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతం.

చెక్క మంచంమీద పడుకుని వుంది విరిసీ విరియని పరువంతో నిండిన ఓ పదిహేనేళ్ళ అమ్మాయి.

ఆమె తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయం చేస్తున్నవాళ్ళే. మరీ కలిగిన కుటుంబం కాకపోయినా సొంత భూములున్నాయి. అటేడు తరాలూ, ఇటేడు తరాలూ పంజాబ్‌లోనే పుట్టడం, గిట్టడం జరిగింది.

స్వచ్ఛమయిన పంజాబ్ రక్తం వారిలో ప్రవహిస్తోంది. వారికి ఓ కొడుకు, ఓ కూతురు. కొడుకు పొలం పనులు చూస్తాడు. కూతురు ఇంటి పని చూస్తుంది.

వేసవికాలం కావడంతో అందరూ ఆరుబయట ప్రదేశంలో పడుకుని వున్నారు. పదిహేనేళ్ల ప్రీతీకౌర్‌లో అప్పుడప్పుడే వయసు ఊహలు దాడిచేస్తున్నాయి. ఊళ్ళోని కుర్రకారు తను బావి దగ్గరకి వెళ్ళినప్పుడు చూసే చూపులు గిలిగింతలు పెడుతున్నాయి.

అప్పుడప్పుడు కలల్లో అవే ఆలోచనలు.

సొగసైన తెల్లని పొగరుబోతు ఎద్దులకు కట్టబడిన బండిమీద చెర్నాకోల తిప్పుతూ వస్తున్నాడో సుందరాకారుడు. ఎంతో మనోహరంగా ఉన్నాడు! మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం అతని సొంతం. బావి నుండి చేదతో నీళ్ళు తోడుతున్న తన తగ్గరకే వస్తున్నాడు.

తను సిగ్గుపడి తలవంచుకుంది. ఎద్దుల మెళ్ళో కట్టిన మువ్వల శబ్దం ఆగింది. తను వూపిరి బిగపట్టింది.

ముందుగా అతని పాదాలు కనిపించాయి. మెల్లగా తలెత్తి చూసి నివ్వెరపోయింది. ఒక్కక్షణం ఏమీ అర్థంకాలేదు. తర్వాత తలంతా ఒకటే హోరు.

అతను చిరునవ్వుతో చూస్తున్నాడు. కెవ్వుమని అరిచాననుకుంది. అరుపు బయటికిరాలేదు. తలంతా నొక్కిపెట్టినట్లుగా ఝుమ్మని ఒకటే రొద.

భయంగా వుంది. రక్తం వడివడిగా ఉరకలెయ్యడం తెలుస్తూనేవుంది. అతను కళ్ళతో తనని ఆప్యాయంగా తడుముతూనే వున్నాడు. ఒళ్ళంతా చెమట్లు పోస్తూనే వున్నాయి. ఏవో జ్ఞాపకాలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు తనెవరు...? ఆ ప్రశ్నే చాలా విచిత్రంగా వుంది. ఎదురుగా కన్పిస్తున్న మనిషెవరో స్పష్టంగా తెలిసిపోతూనే వున్నాడు. కానీ తనెవరో తెలీడం లేదు.

"ఆలోచించు... బాగా" అన్నాడతను.

కళ్ళింతలు చేసుకొని అతని మాటల్నివింది. ఇదేంటి ఇతని మాటలు ఇంత అనురాగంగా, చిరకాల సన్నిహితంగా తోస్తున్నాయి. ఇంతకీ తను ఎవరు?

తను... తను... ప్రీతికాదు... అది ఖచ్చితం. ఆ వాస్తవం బోధపడే సరికి మరింత బెంబేలెత్తిపోయింది. ఒళ్ళంతా వణికిపోతోంది. ఉన్నట్లుండి అతని మొహం దీనంగా మారిపోయింది. కంటివెంట కన్నీరు ధారలు కట్టింది. ఆమె బిత్తరపోయి చూస్తూనే వుంది.

"నన్నొదిలి ఇంతకాలం ఎలా వున్నావు?" అడిగాడు.

ఆమెకి ఏడుపు వచ్చింది. కుళ్ళి ఏడ్చింది.

"వద్దు... ఏడవకు... నా దగ్గరికి వచ్చేయ్. ఇద్దరం కలిసి బతుకుదాం. నువ్వు లేకుండా నేనుండలేను."

"వచ్చేస్తా" దృఢంగా అందామె.

ఆనందంగా చూశాడతను.

"నీ దగ్గరకే వచ్చేస్తా! ఇంతకాలం తెలీలేదు. ఇప్పుడు తెలిసిందిగా, వచ్చేస్తా" నిశ్చయంగా అంది.

"నీ..కో...సం... వే..చి...వుం...టా!" అతను మంచులా కరిగిపోతూ చెప్పాడు.

"నువ్వే నా భర్తవి. నన్ను నీతో తీసుకుపో" గట్టిగా అరుస్తూ అతన్ని పట్టుకోబోయింది. చేతులకి శూన్యమే తగిలింది. కెవ్వున అరిచి కూర్చుంది ప్రీతి. అందరూ ఉలిక్కిపడి లేచారు... అప్పుడే తొలికోడి కూసింది.

* * * * *

వారం రోజులు గడిచాయి. ప్రీతి మనిషీ, మాటా పూర్తిగా మారిపోయాయి. ఆమె అదోలా ప్రవర్తిస్తున్న విషయం వూరూరా పాకిపోయింది.

పేపర్‌వాళ్ళకి ఆసక్తికరమైన న్యూస్‌కావడంతో ఆమెని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చారు. మొట్టమొదట వారిని ఆశ్చర్యపరిచిన విషయం – ఎప్పుడూ వూరుదాటి ఎరుగని ఆమె ఎక్కడో దక్షిణ భారతదేశపు భాష అయిన తెలుగు మాటల్ని కొన్నింటిని మాట్లాడటం. విలేఖరి ఇంటర్వ్యూ మొదలుపెట్టాడు. ఊరంతా గుమిగూడింది. తల్లిదండ్రులు దిగులుగా చూస్తున్నారు. ఆమెని ఏవో క్షుద్రశక్తులు అవహించి ఉంటాయని వారి నమ్మకం.

"మీ పేరు...?" అడిగాడు విలేఖరి.

"స్వాతి..." ఠక్కున అంది.

అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

"మీ పేరు ప్రీతి కదా...?" అతనన్నాడు.

"వూహూ..." కోపంగా చూసింది ఆమె.

"అందరూ ప్రీతి అనే అంటున్నారు."

"అది ఈ జన్మలో పేరు. కిందటి జన్మలో నేను స్వాతిని..." ఎటో చూస్తూ అంది.

అందరి మొహాల్లోనూ ఏదో భయం, కంగారూ తాండవించాయి. ఆ అమ్మాయికి కాస్త దూరం జరిగారు.

ఆ విలేఖరి ఓ అద్భుతాన్ని చూసినట్లుగా ఆమెని చూస్తూ "అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?" అన్నాడు.

"నా భర్త మొన్న కలలో కన్పించాడు. నన్ను తన దగ్గరకి రమ్మన్నాడు" కళ్ళు మెరుస్తుండగా అంది.

"అతను ఎక్కడుంటాడో నీకు తెలుసా...?" ఆత్రుతగా అడిగాడు విలేఖరి.

"ప్చ్...!" పెదవి విరిచిందామె.

"మరి ఎలా కలుస్తారు? అడిగాడు.

పెద్దవాళ్ళలా నిట్టూర్చి పచార్లు చేస్తోందామె.

విలేఖరి ఆమె మూమెంట్స్‌ని విభ్రమంగా పరిశీలిస్తున్నాడు. పదిహేనేళ్ళ పిల్లలా లేదామె. ఏదో పరిపక్వత ఆమె మాటల్లో చేతల్లో కన్పిస్తోంది.

"అదే వారం నుండీ ఆలోచిస్తున్నాను. నాకు సరయిన తోవ తెలీడంలేదు. నేను ఇక్కడ వుండి లాభంలేదు. అతను ఎక్కడున్నాడో వెతుకుతాను. నా భర్తని చేరుకోవడం కోసం నేను ఎన్ని కష్టాలయినా పడతాను..."

ఆమె ఆవేశంగా అంటుంటే ప్రీతి తల్లి ఘొల్లుమంది. ఏడుస్తున్న తల్లివంక విచిత్రంగా చూసింది.

పెద్దగా బాధ కలగడంలేదు. అంతలోనే అసందిగ్ధత... తలంతా నొప్పి. ఆమె కళ్ళు, నొసలు చిట్లించడంచూసి ఆమె అనుభవిస్తున్న సంఘర్షణని గుర్తించి ఆ ఇంటర్వ్యూని నిలుపుదల చేశాడు విలేఖరి. కొన్ని ఫొటోలు తీశాడు. కాలక్షేపం కోసం దీన్ని ఆసక్తికరంగా మలిచి లోకల్ పేపర్లో పబ్లిష్ చేయించాడు.

అది చదివి చుట్టుపక్కలవాళ్ళు తిరునాళ్ళలా ఓ నెలరోజులపాటు ఆమెను చూసెళ్ళారు. ఆ తర్వాత జనానికి ఈ విషయం పాతబడిపోయింది.

ఈ నెల రోజులూ ఎక్కడికి కదిలేవీలులేక బోనులో ఉన్న సివంగిలా వుంది ఆమె పరిస్థితి.

చివరికి ఓ రోజు వూరి చివర ఉన్న తోటలోకి వెళ్ళి ఏదో ఆలోచించుకుంటూ వుండగా, రోడ్డుపక్కగా అంబాసిడర్ కారు ఆగడం గమనించిందామె.

ముగ్గురు మనుషులు దిగారందులోంచి. చాలా స్వాతికంగా ఉన్నారు వాళ్ళు... చూడగానే మంచి వాళ్ళన్న అభిప్రాయం కలిగింది ప్రీతికి.

"నువ్వు స్వాతివేనా?" ఓ వ్యక్తి అడిగాడు.

ఆ మాట చెవులకింపుగా వినబడి మొహం వికసిస్తుండగా అవునని తలూగించింది.

"నీ భర్తని వెతకడానికి వెళ్ళలేదా?"

"వూహూ...!" తప్పుచేసినట్లుగా అంది.

"మరి వెళ్ళవా?" ప్రశ్నించాడా వ్యక్తి.

"ఎక్కడ వెతకాలో తెలీడంలేదు" అంది.

"మాతో వస్తావా? మనమందరం వెతుకుదాం" ఇంకో వ్యక్తి అన్నాడు. త్రిమూర్తులే తనముందు ప్రత్యక్షమైనట్లుగా అన్పించి సంతోషంగా తలవూగించింది.

"పదమ్మా... పద ఎప్పటికయినా ఆ భగవంతుడే నిన్ను నీ భర్త దగ్గరకి చేరుస్తాడు" ఆమెని కారు దగ్గరకి తీసుకెళుతూ అన్నాడు వాళ్ళలో ఒకతను.

ప్రీతి కార్లో కూర్చుంది. కళ్లముందు... కలలో కనిపించిన తన భర్త రూపమే మార్గం నిర్దేశించినట్లుగా అన్పించడంతో నిస్సంకోచంగా వారివెంట నడిచింది. ఆ తర్వాత ఆ వూరి ప్రజలకి ఆమె మరి కన్పించలేదు.

* * * * *

2005వ సంవత్సరం... తెల్లవారుఝాము... నాలుగున్నర అయింది. విశాఖ నగరం ఇంకా నిద్రావస్థలోనే వుంది.

డిశంబర్ నెల చలి వణికించేస్తోంది. బస్టాండ్‌లో ఒకటి అర బస్సులు బయలుదేరు తున్నాయి. ప్లాట్‌ఫాంనెంబర్ ఫైవ్‌లో కుర్చీలో కూర్చుని బస్‌కోసం ఎదురుచూస్తున్నాడు రామ్‌ప్రతాప్. అతనితోపాటు ఇంకో పదిమంది వరకూ ప్రయాణీకులు వున్నారు. సరిగ్గా పావుతక్కువ అయిదుకల్లా 'హౌనక ఢిల్లీ' వెళ్ళే బస్ వచ్చింది.

రామ్‌ప్రతాప్ లేచి నిలబడ్డాడు. అతను చేతిలోకి బ్రీఫ్‌కేస్ తీసుకుని నాలుగడుగులు వేశాడో లేదో మిగతా జనాలంతా బిలబిల్లాడుతూ అతన్ని తోసుకుంటూ బస్‌వైపు పరుగులు తీశారు. బస్ అక్కడ పావుగంట ఆగుతుందనీ వాళ్ళకి తెల్సు. పెద్దగా రష్ లేకపోవడమూ చూస్తూనే వున్నారు.

అయినా తోసుకుంటూ వెళ్ళి బస్ ఎక్కుతున్నారు. ముందునుంచీ అలవాటయిన తత్వం ఎక్కడికి పోతుంది?

రామ్‌ప్రతాప్ నవ్వుకుంటూ వెళ్ళి బస్సెక్కాడు. అతను ఆల్రెడీ రిజర్వేషన్ చేయించుకున్నాడు. తన సీట్లో ఎవరో కూర్చొనివుంటే వాళ్ళకి తన టికెట్ చూపించాడు.

ఇంత కష్టపడి జనాలను తోసుకుంటూ ఎక్కినప్పటికీ అది రిజర్వేషన్ సీటు కావడంతో ఆ సీట్లో కూర్చున్నావిడ నిరుత్సాహంగా లేచి వేరేవైపుకి వెళ్ళింది.

ఐదింటికల్లా బస్సు బయలుదేరింది. మంచుతోకూడిన గాలి రివ్వున కొడుతుంటే విండో క్లోజ్‌చేశాడు. ట్రాన్స్‌పరెంట్ గ్లాస్‌లోంచి సిటీ మసకగా కన్పిస్తోంది.

ఐదారు కిలోమీటర్లు వెళ్ళాక ఇంకో పదిహేనుమంది వరకూ ఎక్కారు. అరకు ఘాట్‌రోడ్ మొదలయ్యేసరికి అక్కడక్కడా ఎక్కిన పాసింజర్లతో బస్ నిండింది.

ఒకసారి బస్ అంతా కలయజూశాడు రామ్‌ప్రతాప్. పక్కనున్న రిజర్వేషన్ సీటుతప్ప బస్ ఫుల్‌గా వుంది.

బస్‌లో వున్న జనాలు ఇంచుమించు చాలా మంది గిరిజనులే. విశాఖ పట్నానికి ఏదో ఒక పనిమీద వచ్చి తిరిగి తమ గిరిజన గ్రామాలకి వెళుతున్నవాళ్ళే! అక్కడక్కడా రామ్‌ప్రతాప్ లాంటి వాళ్ళూ వున్నారు.

రామ్‌ప్రతాప్ 'మోడ్రన్ ఇంజినీర్స్' అనే ప్రైవేట్ ఫర్మ్‌ని సొంతంగా నడుపుకుంటున్నాడు. టెలిఫోన్, సేల్స్ అండ్ సర్వీస్ చేసే ఫర్మ్ అది. ఎంటెక్ అయిన వెంటనే ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా ఈ ఫర్మ్ స్థాపించాడు.

మూడేళ్ళు తిరిగేసరికి అయిదుగురికి తన ఫర్మ్‌లో ఉద్యోగాలిచ్చే స్టేజికి చేరుకున్నాడు. నెలకి ముప్ఫయి, నలభైవేలు మిగులుతుంటాయి.

అతనికి పెద్దగా బాధ్యతలంటూ ఏమీలేవు. అందుకే ఈ మూడేళ్ళలో తన వ్యక్తిగత జీవితానికి సరిపోయిన లగ్జరీస్‌ని సమకూర్చుకున్నాడు. రీసెంట్‌గా లోన్‌పెట్టి మంచి ఏరియాలో ఇల్లుకట్టాడు. అతను సర్వీస్‌లో భాగంగా ఇంపార్టెంట్ ఏరియాలకి తానే వెళ్ళి సర్వీస్‌చేసి వస్తాడు. అది నామోషీగానో, చిన్నతనంగానో అసలు భావించడతను. దాంతో సహజంగానే కస్టమర్లకి ఈ ఫర్మ్‌మీద గుడ్‌విల్ ఏర్పడింది.

కంపెనీ సిస్టమ్స్... ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలతోపాటు, ఒరిస్సాలోకూడా చాలా వున్నాయి. అందులో భాగంగానే లంతాపుట్‌లో వున్న మిషనరీ హాస్పిటల్‌కి సర్వీస్ నిమిత్తం వెళ్తున్నాడు.

షూట్‌రోడ్ ప్రారంభమయింది. ఎన్నిసార్లు చూసినా మళ్లీ కొత్తగా ఉద్విగ్నంగా మారింది రామ్‌ప్రతాప్ హృదయం. లోతైన లోయలు, ఎత్తైన కొండలు... అన్నీ పచ్చదనాన్ని ఆచ్ఛాదనగా కప్పుకున్నాయి. అప్పుడే మంచుతెరలు విచ్చు కుంటున్నాయి. పిల్లమబ్బులు తమ అట్టహాసాన్ని వదిలి లోయల్లోనూ విహారం చేస్తున్నాయి.

కొండల లోపల ఏదో అద్భుతం దాగున్నట్లు వాటి కొనభాగాలు కాంతిని సంతరించు కుంటున్నాయి. ఉండీ వుడిగీ ఓ కిరణం భూమితో సయ్యాటలాడు తోంది. కొన్నిచోట్ల పొగమంచు ఇంకా వీడనేలేదు. ఇంత అద్భుతమైన సౌందర్యాన్ని అప్పుడప్పుడైనా చూడని జీవితం వృధా...

లైఫ్ మొనాటని అన్పించినప్పుడు ఈ ఏరియానుంచి వచ్చే కాల్స్‌కి అసిస్టెంట్స్‌ని పంపకుండా తనే అటెండ్ చేస్తాడు రామ్‌ప్రతాప్. ట్రిప్ ముగించి రాగానే అతనిలో నూతన జవసత్వాలు చేకూరతాయి. విండో ఓపెన్‌చేసి చలిగాలిని ఆస్వాదిస్తూ బైటకి చూస్తూ కూర్చున్నాడు.

తైడ స్టాప్‌లో బస్ ఆగింది. ఆ స్టాప్‌లో ఓ మెరుపు తీగలాంటి అమ్మాయి బస్సెక్కింది. కిందనున్న ఇద్దరు అమ్మాయిలూ, ఓ అబ్బాయీ ఆమెకి బై చెప్పారు.

బెదురుచూపులు చూస్తూ బస్సంతా కలియజూసింది. అందరూ కళ్ళప్పగించి తమకి అలవాటైన పద్ధతిలో ఆమెని పైనుంచి కిందికి పరిశీలించేశారు. కాలి చెప్పునుంచి తల క్లిప్పువరకూ ఏదీ వదల్లేదు.

ఆమె తన టికెట్ చూపించింది. కండక్టర్ ఆమె సౌందర్యానికి అబ్బురపడుతూ చూపు తిప్పుకోలేక ఇబ్బందిపడుతూ ఆమెకి సీటు చూపించాడు.

రెండు చేతులతో రెండు బ్యాగులు పట్టుకొని తూలుతూ తన సీట్‌వైపు నడిచి ఒక్కసారిగా షాక్‌కొట్టినట్లు నిలబడింది.

తన పక్కసీట్లో ఓ మగాడు. ఆమె కండక్టర్‌వైపు చూడబోయింది. ఈలోగా షూట్‌రోడ్ మలుపు వచ్చింది. డ్రైవర్ సర్రున కోశాడు. ఏం జరుగుతోందో ఊహించేలోపుగానే ఆమె అతని ఒళ్ళో పడి వుంది.

ఆమె పెదాలు అతని బుగ్గమీదనుంచి హృదయంమీదకి జారాయి. ఆమె శరీరం అతని చేతుల్లో, కిటికీలోంచి మొహం బైటకిపెట్టి చూస్తున్న రామ్‌ప్రతాప్‌కి తన ఒళ్లో ఓ పూలచెండు వాలినట్లనిపించింది.

ఆ పరిమళానికి ఆశ్చర్యపడుతూ తలతిప్పి చూశాడు. తనకు అత్యంత సన్నిహితంగా... తన ఒళ్ళో బిక్కమొహం వేసి పడిపోయినట్లున్న ఆమె....

ఏం జరిగిందో అర్థమవడానికి ఇద్దరికీ కాసేపు పట్టింది. పక్కసీట్లో వాళ్ళు దొంగచూపులు చూస్తున్నారు. ఆమె సిగ్గుపడిపోయింది. చేతుల్లోని బ్యాగులు వదిలేసి నిలబడింది. ఆమె శరీరంలో చిట్టచివరి అణువు కూడా తననుంచి దూరం అయిన వెంటనే అకస్మాత్తుగా, విచిత్రంగా తన శరీరంలో ఏదో భాగాన్ని కోల్పోయినట్లు కొద్దిక్షణాలపాటు వెలితిగా ఫీలయ్యాడు రామ్‌ప్రతాప్.

ఆమె తన లగేజ్‌ని పైకెత్తింది. నడుం దగ్గర చీరకొంగు తొలగి గులాబీరంగు నెలవంక ప్రత్యక్షమయింది. ఓ అద్భుతాన్ని చూసినట్లు చూస్తూండిపోయాడు.

మధ్యలో ఎందుకో తలతిప్పి చూసిన ఆమెకి ఇంతలేసి కళ్ళతో తన నడుంవంక చూస్తున్న రామ్‌ప్రతాప్ కన్పించాడు. రాక్‌లోకి బ్యాగ్‌ని దభీమని నెట్టి గాభరాగా వంగి కూర్చుంటే చెదిరిన కొంగుచాటునుంచి నిండు చందమామలు కనిపించాయి.

మతిపోయినట్లయింది అతనికి. సిగ్గుతో, ఇబ్బందితో ముక్కు, చెవులూ, చెంపలూ ఎర్రబడిన ఆ అమ్మాయి మొహాన్ని చూడాలని తపిస్తున్నా మనసుని కంట్రోల్ చేసుకుంటూ మొహం తిప్పుకున్నాడు రామ్‌ప్రతాప్.

పాపం నిజంగా ఇబ్బందికర పరిస్థితే. మనసులోనే ఆమె ఇందాకటి స్థితిగురించి జాలిపడ్డాడు. ఆ అమ్మాయి సీట్లో ఆ మూలకి ఒదిగిపోయి కూర్చుంది.

రామ్‌ప్రతాప్ విండోవైపు వుండడంతో ఆమె అసలు అటువైపే చూడటంలేదు... కానీ ప్రకృతిని మిస్సయిపోతున్నానన్న బాధవుంది కాబోలు మధ్యమధ్య అటువైపు విండోల్లోంచి తొంగితొంగి చూస్తోంది.

'ఈ ఏరియాకి రావడం ఇదే మొదలు కాబోలు... తను అప్పుడప్పుడూ చూసే ప్రదేశాలేగా!' అనుకుని ఆమెవైపు తిరిగి "విండో దగ్గర కూర్చుంటారా?" అన్నాడు.

చిన్నగా నొసలు చిట్లించి అసహనాన్ని వ్యక్తంచేయడానికి ప్రయత్నిస్తూ "అవసరంలేదు" అంది.

అతను చిన్నగా భుజాలు ష్రగ్‌చేసి వూరుకున్నాడు. ఓ అయిదు నిమిషాలు గడిచిన తరువాత తన సమాధానం అతనికి కోపాన్ని తెప్పించి వుంటుందేమోనని ఓసారి కొంచెం తలతిప్పి అతనివైపు చూసింది.

అతని మొహం పక్కనుంచి కన్పిస్తోంది. ఆరోగ్యంగా కన్పిస్తోన్న చెంపలు... సూదిగా మొనదేలిన నాసిక... ఆర్మీవాళ్ళలా కటింగ్... సుదృఢంగా కన్పిస్తున్న మెడ.... చామనఛాయ రంగు... అందం, ఆరోగ్యం పోటీ పడుతూ స్టిఫ్‌గా వున్న శరీరం... అదికాదు ఆమెని ఆకర్షించింది.

అతని మొహం ప్లెయిన్‌గా వుంది. మొహంలో చిరునవ్వు తాండవిస్తోంది. ప్రకృతి అతనికి ఎంత ఆనందాన్నిస్తుందో అతని మొహమే తెలియజేస్తోంది.... అసలు పక్కన అమ్మాయే లేనట్లు లీనమైపోయాడు...

కొంచెం నిశ్చింతగా అన్పించబోయింది. కానీ ఇందాక లగేజ్ పైనపెడ్తున్నప్పుడు అతను తనని ఎక్కడ, ఎలా చూశాడో గుర్తొచ్చి మళ్ళీ బిగుసుకుపోయింది.

మధ్యలో ఎందుకో తలతిప్పి చూసిన రామ్‌ప్రతాప్‌కి ఆమె తన వైపు చూడటం కన్పించింది. తన చూపుతో చూపులు కలియగానే తడబడి చూపులు బలవంతంగా లాగేసుకుని మొహం తిప్పేసుకుంది.

'అమ్మాయిలు ఇంతే' మనసులో అనుకున్నాడు.

అరకు చేరుకుంది బస్...టిఫిన్ కోసం బస్ అక్కడ అరగంట అగుతుంది. కొందరు ప్రయాణీకులు దిగిపోతున్నారు. మరికొందరు ఎక్కుతున్నారు.

రామ్‌ప్రతాప్ బస్‌దిగి ఎదురుగా ఉన్న చిన్న హోటల్లోకి వెళ్ళాడు. ఇడ్లీ, కాఫీ ఆర్డరిచ్చి బస్‌వైపు చూశాడు.

ఆమె తన సీట్లోకి జరిగి కూర్చుని చుట్టుపక్కల జనాలవంక ఆశ్చర్యంగా చూస్తోంది.

మొట్టమొదటిసారి అరకు వచ్చినప్పుడు తనకి ఇలాగే ఆశ్చర్యంగా ఉండేది. ఇక్కడి గిరిజనులూ, వాళ్ళ వ్యవహారశైలి, వారి నమ్మకాలు, అమాయకత్వం... అంతలోనే గడుసుతనం... మరీ ముఖ్యంగా వెహికల్స్ హారన్‌కొట్టినా పట్టించుకోక రోడ్డు నడిమధ్యనుంచి నడుచుకుంటూ వెళ్ళే జనాలు అన్నీ విచిత్రంగా వుండేవి.

నిజమే కదా! మనలా లేనిది ప్రతీదీ మనకి ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. తెలుసుకోవాలని పిస్తుంది. అతను టిఫిన్ చేస్తూ ఆలోచించాడు. ఆమె ఒక్కతీ టిఫిన్ కోసం కిందికి దిగడానికి మొహమాటపడి వుండొచ్చు... అందుకే బాయ్‌కి చెప్పి టిఫిన్, కాఫీ బస్‌లోకి పంపించాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Manava+Yagnam**

* * *

**Read other books by Suryadevara Rammohana Rao @**

http://kinige.com/kbrowse.php?via=author&name=Suryadevara+Rammohana+Rao